మంత్రివర్గ విస్తరణ లేనట్టే!

- సీఎం రేవంత్‌కు దొరకని రాహుల్ అపాయింట్‌మెంట్

హైదరాబాద్, డిసెంబర్ 14 (నమస్తే తెలంగాణ): మంత్రివర్గ విస్తరణ మీద ఆశలు పెట్టుకున్న వారికి మళ్లీ నిరాశే మిగిలింది. ఢిల్లీ పర్యటనకు 28వసారి వెళ్లిన రేవంత్‌రెడ్డి ఉత్త చేతులతోనే తిరిగొచ్చారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ అపాయింట్‌మెంట్ కోసం 3 రోజుల పాటు ఢిల్లీలో ఉన్నారు. కానీ రాహుల్ అపాయింట్‌మెంట్ తిరస్కరించగా ఏఐసీసీ పెద్దలు కనీసం మొహం చూసేందుకు ఇష్టపడలేదని గాంధీభవన్‌లో చర్చ జరుగుతున్నది. సీఎం కంటే ముందు ఢిల్లీ వెళ్లిన ఇద్దరు మంత్రులో రాహుల్‌తో భేటీ అయ్యారు. రేవంత్ పాలన వైఫల్యాలపై చెప్పినట్టు తెలుస్తున్నది. కేంద్ర మంత్రులతో రేవంత్ భేటీ సమయంలోనే ఫార్ములా-ఈ కార్ రేసు కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై ఎఫ్ఐఆర్ నమోదుకు గవర్నర్ అనుమతించారనే ప్రచారం చర్చనీయాంశంగా మారింది.

సీఎంవోలో నువ్వా.. నేనా!?

మొదటిపేజీ తరువాయి...

సచివాలయంలో ప్రస్తుతం ఒక రకమైన నిర్లిప్త వాతావరణం కనిపిస్తున్నది. కీలక అధికారిణికీ, కొందరు సీనియర్ ఐఏఎస్‌లకు పడటం లేదనే గుసగుసలు వినిపిస్తున్నాయి. మరోవైపు, సీఎంవోలో కూడా ఒక ముఖ్యమైన అధికారి తీరు విచిత్రంగా ఉన్నదని, రొటీన్ ఫైళ్లకు కూడా నోట్‌ఫైల్, విత్ సిగ్నేచర్‌తో రమ్మంటున్నారని అధికారులు తలలు పట్టుకుంటున్నారు. సదరు అధికారి తీరుపై చాలామంది ఐఏఎస్‌లు ఆగ్రహంగా ఉన్నట్టు ప్రచారం జరుగుతున్నది. చిన్నచిన్న అంశాలు, సాధారణ, పరిపాలనా విషయాల్లోనూ వారి జోక్యం పెరిగిపోయిందని ఐఏఎస్‌లు ఆందోళన చెందుతున్నట్టు సమాచారం. ప్రధానంగా ఆ ఇద్దరూ వారికి ఇష్టం లేని ఐఏఎస్‌ల పట్ల దురుసు ధోరణితో వ్యవహరిస్తున్నారని, ఆయా బ్యూరోక్రాట్లకు సంబంధించిన ఫైళ్లు సదరు అధికారిణి వద్దకు వెళ్తే.. వెనుకా ముందు చూడకుండా 'డిస్కర్షన్' అని రాస్తున్నారంటూ ప్రచారం జరుగుతున్నది. ఫైల్‌పై 'డిస్కర్షన్' కోసం వెళ్లిన అధికారులకు సమయం ఇవ్వకుండా గంటల తరబడి నిరీక్షింప చేస్తున్నారని, కొందరు అధికారులైతే రోజుల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి వస్తున్నదని చెప్పుకుంటున్నారు. వారం రోజుల క్రితం ఇద్దరు సీనియర్ అధికారులు ఫైళ్లు పట్టుకొని సదరు అధికారిణి కోసం రెండు రోజులు నిరీక్షించాల్సి వచ్చిందని సచివాలయంలో చర్చించుకుంటున్నారు. ప్రత్యేకంగా ఒక వర్గానికి చెందిన సీనియర్ ఐఏఎస్‌లను టార్గెట్ చేస్తూ వారిని ఇప్పటికే అప్రధాన పోస్టుల్లోకి పంపించారని, అయినా ఇంకా వారి పట్ల కక్షపూరిత ధోరణితోనే వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సీఎంవోలోని మరో అధికారి తీసుకుంటున్న 'అతి జాగ్రత్తలు' కారణంగా అధికారులు ఇబ్బంది పడుతున్నట్టు సమాచారం. సీఎంవోకు ఎటువంటి ఫైల్ పంపినా.. సదరు ఫైల్‌కు సంబంధించిన నోట్‌ఫైల్‌తోపాటు దాని మీద, అధికారి సంతకం కూడా ఉండాలని మౌఖిక ఆదేశాలు ఇస్తున్నట్టు అధికారులు చెప్తున్నారు. అదంతా పాలకులు మారి, భవిష్యత్‌లో ఆయా ఫైళ్ల మీద ఏమైనా నవిచారణ లాంటివి జరిగితే తన మీదకు రాకుండా ఉండేందుకే ముందు జాగ్రత్తగా అధికారులను ఇరికించే ప్రయత్నమేనని సచివాలయంలో చర్చించుకుంటున్నారు. రొటీన్‌గా వెళ్లే ఫైళ్లకు సైతం నోట్‌ఫైల్ కావాలని పట్టుబడుతున్నారని, దీంతో ఫైళ్లు ముఖ్యమంత్రి వద్దకు వెళ్లకుండా వందల కొద్ది పెండింగ్‌లో ఉంటున్నాయని సచివాలయ అధికారులు ఆందోళన చెందుతున్నారు.

హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ అస్తిత్వంపై దాడి-చర్చ అంశంపై జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత, చిత్రంలో వకుళాభరణం కృష్ణమోహన్, దేవీప్రసాద్, అయాచితం శ్రీధర్, జూలూరు గౌరీశంకర్, టంకశాల అశోక్, గోగు శ్యామల, బీవీఆర్ చారి తదితరులు

ఉద్యమ తల్లినే ఆరాధిస్తం

ప్రతి ఊరిలో తెలంగాణ తల్లి విగ్రహం • అగ్రవర్ణాలకే బతుకమ్మ సొంతమన్న కాంగ్రెస్ నేతలు క్షమాపణలు చెప్పాలి

బహుజనులను కించపరిచిన వారిపై పీసీసీ చీఫ్ చర్యలెందుకు తీసుకోలేదు? • రేవంత్ ప్రతిష్ఠించింది కాంగ్రెస్ తల్లే: కవిత

- సోనియా అనుమతితోనే విగ్రహం నుంచి బతుకమ్మను తీసేసిండ్రా?
- కేరళ చీర కట్టుకున్న ప్రియాంక గాంధీ రేవంత్‌రెడ్డి నిర్ణయానికి మద్దతిస్తారా?
- ఎన్నడూ జై తెలంగాణ అనని వ్యక్తి ముఖ్యమంత్రి కావడం దురదృష్టకరం
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత
- తెలంగాణ తల్లి విగ్రహం, బతుకమ్మపై రౌండ్ టేబుల్ సమావేశంలో తీర్మానాలు

"అందరం కలిస్తేనే అందమైన బతుకమ్మ అవుతుంది.. అందరం కలిస్తేనే అందమైన సమాజం అవుతుందన్న సందేశం ఇచ్చేది బతుకమ్మ. అలాంటి బతుకమ్మ తెలంగాణతల్లి చేతిలో లేకపోతే తెలంగాణ సమాజంలో స్నేహశీలత, సుహృద్భావం ఎలా కనిపిస్తుంది?

-ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్, డిసెంబర్ 14 (నమస్తే తెలంగాణ): ఉద్యమకాలం నుంచి ఉన్న తెలంగాణ తల్లినే ఆరాధిస్తామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తేల్చిచెప్పారు. తెలంగాణ తల్లి విగ్రహాలను ఊరూరా ప్రతిష్ఠించే కార్యక్రమాన్ని కొనసాగిస్తామని ప్రకటించారు. బతుకమ్మ అగ్రవర్ణాల పండుగ అన్న అహంకారపు వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని తెలంగాణ జాతికి కాంగ్రెస్ పార్టీ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ తల్లి రూపురేఖలు మార్చడం, బతుకమ్మను కించపరిచేలా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతున్న నేపథ్యంలో 'తెలంగాణ అస్తిత్వంపై దాడి-చర్చ' అనే అంశంపై తెలంగాణ జాగృతి శనివారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ సమావేశంలో మేధావులు, వివిధ సంఘాల నేతలు ఇచ్చిన సూచనలు, సలహాల ఆధారంగా పలు తీర్మానాలను ఆమోదించామని చెప్పారు.

సోనియా, ప్రియాంకాగాంధీకి సూటి ప్రశ్న

మహిళలు జరుపుకొనే బతుకమ్మను ముఖ్యమంత్రి అవమానించిన విషయం తెలిసిందా లేదా? అని సోనియాగాంధీని కవిత ప్రశ్నించారు. లేదంటే మీ సమ్మతితోనే రేవంత్‌రెడ్డి అవమానిస్తున్నారా అన్నది తెలంగాణ సమాజానికి చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రియాంకా గాంధీ కేరళ నుంచి లోక్‌సభకు ఎన్నికయ్యారు కాబట్టి అక్కడి చీరను కట్టుకొని పార్లమెంటులో మాట్లాడారని, మరి ఇక్కడి సీఎం తెలంగాణ తల్లి చేతుల్లోని బతుకమ్మను మాయం చేశారని, దీనికి మద్దతిస్తున్నారా? అని ప్రశ్నించారు. సోనియా, రాహుల్, ప్రియాంకా గాంధీ వచ్చి గ్యారెంటీ కార్డులపై సంతకాలు చేసి తెలంగాణ ప్రజలను గౌరవిస్తామని చెప్తే నమ్మి కాంగ్రెస్‌కు ఓట్లు చేశారన్నారు. బహుజనులను కించపరిచేలా మాట్లాడిన ఎమ్మెల్యేపై బీసీ వర్గాలకు చెందిన పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు.

* రేవంత్‌రెడ్డిలో తెలంగాణ ఆత్మలేదు

ఎన్నడూ జై తెలంగాణ అని నినదించని వ్యక్తి తెలంగాణకు ముఖ్యమంత్రి కావడం మన దురదృష్టమని కవిత వాపోయారు. రేవంత్‌రెడ్డికి మనసు, ఆత్మ లేదని, ఆయన ఉద్యమంలో ఏనాడూ పాల్గొనలేదు కాబట్టి తెలంగాణ హృదయం అర్థమవ్వడం లేదని ఎద్దేవాచేశారు. తెలంగాణ ఉద్యమం, పునర్నిర్మాణంలో రేవంత్‌రెడ్డి ఎక్కడా లేరని గుర్తుచేశారు. తెలంగాణ పునర్నిర్మాణ సమయంలో కేసీఆర్ ప్రభుత్వాన్ని రేవంత్‌రెడ్డి అస్థిరపరిచే కుట్ర చేశారని, ఉద్యమకాలంలో ఉద్యమకారులపై తుపాకీ ఎక్కిపెట్టిన వ్యక్తి రేవంత్‌రెడ్డి అని ధ్వజమెత్తారు.

సంస్కృతిపై దాడిని ఖండించాల్సిందే

మన సంస్కృతిపై జరుగుతున్న దాడిని ప్రతి ఒక్కరూ ఖండించాల్సిన అవసరం ఉన్నదని కవిత స్పష్టం చేశారు. తెలంగాణ తల్లిపై ప్రేమ లేదు కాబట్టే విగ్రహ రూపాన్ని సీఎం రేవంత్‌రెడ్డి మార్చారని విమర్శించారు. తెలంగాణ తల్లి చేతిలో ఉన్న బతుకమ్మను చూస్తే తెలంగాణ సమాజాన్ని చూసినట్టు ఉంటుందని స్పష్టంచేశారు. అందరం కలిస్తేనే అందమైన సమాజం అవుతుందన్న సందేశం ఇచ్చేది బతుకమ్మ అని, అలాంటి బతుకమ్మ తెలంగాణ తల్లి చేతిలో లేకపోతే తెలంగాణ సమాజంలో స్నేహశీలత, సుహృద్భావం ఎలా కనిపిస్తుందని ప్రశ్నించారు. మన అస్థిత్వాన్ని దెబ్బతీసే ధైర్యం ఎవరికీ లేదని, అలాంటి ప్రయత్నాలు జరుగుతుంటే అడ్డుకోవాల్సిన అవసరం మనకు ఉన్నదని, ఉనికి, సంస్కృతిపై దాడి జరుగుతున్నా మాట్లాడకపోతే చరిత్ర మనల్ని క్షమించదని స్పష్టంచేశారు. రౌండ్ టేబుల్ సమావేశంలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ మాజీ సభ్యురాలు సుమిత్రా నంద్, సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు సంజీవ్ నాయక్, విశ్రాంత అధ్యాపకురాలు దేవకీదేవి, అంబేద్కర్ యూనివర్సిటీ మాజీ వైస్ చాన్స్‌లర్, ప్రొఫెసర్ సీతారామారావు, గాయకురాలు తేలు విజయ, సీనియర్ జర్నలిస్టు వేణుగోపాలస్వామి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుల సంఘం రాష్ట్ర ఉపధ్యక్షురాలు వీ జయంతి, సామాజిక ఉద్యమకారిణి, ప్రొఫెసర్ రేఖారావు, విద్యార్థి నాయకుడు యాకుబ్ రెడ్డి, తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమణ కుమార్, ప్రొఫెసర్ కనకదుర్గ, ప్రముఖ కవి కోట్ల వెంకటేశ్వరరెడ్డి, సీనియర్ జర్నలిస్టు టంకశాల అశోక్, ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి నాయకుడు ఏల్చల దత్తాత్రేయ, ఉద్యోగ సంఘాల మాజీ నాయకుడు దేవీప్రసాద్, తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ అధ్యక్షుడు, ప్రముఖ రచయిత జూలూరి గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆమోదించిన తీర్మానాలు

- ఒక చేతిలో జొన్నకర్ర, మరో చేతిలో బతుకమ్మ ధరించిన తెలంగాణ తల్లి వైభవంపై పద్యాలు, కవితలు రచించి పుస్తకాల ప్రచురణ
- విద్యార్థుల నోట్‌బుక్స్, రైటింగ్ ప్యాడ్స్ అన్నింటిపై తెలంగాణ తల్లిని ముద్రించి పిల్లలకు పంపిణీ
- తెలంగాణ తల్లి ఆరాధాన తర్వాతే సభలు, సమావేశాలు మొదలుపెట్టే సంప్రదాయాన్ని ఇకముందూ కొనసాగింపు
- ప్రస్తుతం రేవంత్‌రెడ్డి రూపొందించిన విగ్రహానికి కాంగ్రెస్ మాతగా నామకరణం
- ఊరూరా ఉద్యమ కాలం నాటి తెలంగాణ తల్లి ప్రతిష్ఠాపన కార్యక్రమం కొనసాగింపు

బతుకమ్మ బహుజనుల పండుగ: దేశపతి శ్రీనివాస్

బతుకమ్మ పూర్తిగా బహుజన కులాల పండుగ అని, అగ్రవర్గాల పండుగ కానేకాదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ స్పష్టం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి కేవలం తెలంగాణ తల్లిపైనే కాకుండా బతుకమ్మపై కూడా దాడి చేస్తున్నారని విమర్శించారు. ఆదిమ సంస్కృతి నుంచి వచ్చిన బతుకమ్మ తెలంగాణకు మాత్రమే ప్రత్యేకమని తేల్చిచెప్పారు. సమైక్య రాష్ట్రంలో తెలంగాణపై జరిగిన దాడి కన్నా ఇప్పుడు ఎక్కువగా జరుగుతున్నదని, కొంత మందిలో ఇంకా సమైక్యవాద పోకడలు పోలేదని విమర్శించారు. ఇది కేవలం తెలంగాణ తల్లిపై దాడి కాదని, మలిదశ ఉద్యమ చరిత్రను చెరిపివేయాలన్నది రేవంత్‌రెడ్డి కుట్ర అని మండిపడ్డారు. తెలంగాణ అమరుల స్థూపం వద్దకు కూడా సీఎం రేవంత్‌రెడ్డి వెళ్లడం లేదని చెప్పారు. చార్మినార్‌ను, కాకతీయ కళాతోరణాన్ని రాచరిక చిహ్నాలని సీఎం అనడం సరికాదని హితవుపలికారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం ఉద్యమం చేసేందుకు ప్రేరేపించింది తెలంగాణ తల్లి అని, తెలంగాణ తల్లే కోదండరాంను జేఏసీ చైర్మన్‌గా చేసిందని, కేసీఆర్‌ను నాయకుడిని చేసిందని వివరించారు. అందరి గుండెల్లో ముద్రించుకొని ఉన్న తెలంగాణ తల్లిని మార్చడం దారుణమని ఆగ్రహం వ్యక్తంచేశారు. రేవంత్‌రెడ్డి కిరీటం పెట్టుకోవచ్చు కానీ తెలంగాణ తల్లికి మాత్రం ఉండొద్దా? అని ప్రశ్నించారు. ప్రాచీన శిల్ప సంపద నుంచి పుట్టింది తెలంగాణ తల్లి అని వివరించారు.

శిల్ప శాస్త్రం ప్రకారమే రూపం: ఎమ్మెల్సీ వాణిదేవి

కేసీఆర్ పాలనలో తెలంగాణ స్వర్ణయుగాన్ని తలపిస్తే.. ఏడాది కాంగ్రెస్ పాలన పాత చీకటి రోజులను గుర్తు చేస్తున్నదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ వాణిదేవి విమర్శించారు. శిల్ప శాస్త్రం ప్రకారమే కేసీఆర్ తెలంగాణ తల్లి విగ్రహాన్ని తయారు చేయించారని గుర్తుచేశారు. తెలంగాణ తల్లి గొప్పగా ఉండాలి కాని, బీదగా ఉండవద్దని నాడు కేసీఆర్ చెప్పారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల భావోద్వేగాలను దెబ్బతీసే కుట్ర చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు.

చేతి గుర్తు కోసం బతుకమ్మ మాయం: వీ ప్రకాశ్

చేతి గుర్తు కోసమే తెలంగాణ తల్లి నుంచి బతుకమ్మను మాయం చేశారని కార్పొరేషన్ మాజీ చైర్మన్ వీ ప్రకాశ్ విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి హామీల నుంచి ప్రజల దృష్టి మళ్లించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ దుష్ట లక్ష్య సాధన కోసం రేవంత్‌రెడ్డి తెలంగాణ తల్లిని కూడా వదిలిపెట్టలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. సచివాలయం లోపల తెలంగాణ తల్లిని బందీ చేశారని విమర్శించారు. ఇక నుంచి జూన్ 2న తెలంగాణ తల్లి విగ్రహాలకు పూజలు చేసే కార్యక్రమం చేపడదామని పిలుపునిచ్చారు. ప్రభుత్వం ఎన్ని జీవోలు తెచ్చినా, ఎన్ని కేసులు పెట్టినా ఉద్యమ తెలంగాణ తల్లి కోసమే తమ పోరాటమని స్పష్టం చేశారు.

రూపు మార్చడం దారుణం: కేవీ రమణాచారి

దేవతామూర్తిలా ఉన్న తెలంగాణ తల్లిరూపును మార్చడం దారుణమని బ్రాహ్మణ పరిషత్తు మాజీ చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ కేవీ రమణాచారి ఆగ్రహం వ్యక్తంచేశారు. స్వయంగా ప్రభుత్వమే తెలంగాణ అస్తిత్వాన్ని దెబ్బతీయడం సిగ్గనిపిస్తున్నదని మండిపడ్డారు. సబ్బండవర్గాలు కలిసి ఆడుకునే బతుకమ్మను కొంతమంది కించపర్చడం సరికాదని హితవుపలికారు. ప్రభుత్వం ప్రతిష్ఠించిన విగ్రహంలో అభయ హస్తం అంటే ఏమిటో ప్రతి ఒక్కరికీ తెలుసని చెప్పారు.

సాంస్కృతిక వైభవానికి ప్రతీక : వకుళాభరణం కృష్ణమోహన్

తెలంగాణ తల్లి ఒక ప్రతిమ కాదని, సాంస్కృతిక వైభవానికి ప్రతీక అని బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్ చెప్పారు. ఉద్యమానికి స్ఫూర్తిగా నిలిచేలా తెలంగాణ తల్లిని కేసీఆర్ తయారు చేయించారని తెలిపారు. చరిత్ర నిర్మాణం, ఉద్యమాలు, గత వైభవాలపై అవగాహన లేకుండా సీఎం రేవంత్‌రెడ్డి చరిత్రను చెరిపే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. 'బతుకమ్మ అంటే బతుకుజీవుడా అని కాదు.. అది మహిళా శక్తికి ప్రతీక.. అటువంటి బతుకమ్మనే తీసేశారు' అని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రానికి గొప్ప పేరు తేకున్నా, వైభవాన్ని తొలగించవద్దని సూచించారు.

ప్రజల అభీష్టాన్ని మార్చలేరు : టంకశాల

జీవోలతో, బెదిరింపులతో ఇంగితం లేకుండా మాట్లాడితే ప్రజల అభీష్టాలు మారవని సీఎం రేవంత్‌రెడ్డికి ప్రముఖ సంపాదకుడు టంకశాల అశోక్ చురకలంటించారు. తెలంగాణ తల్లి, బతుకమ్మ ప్రజల్లో సిర్థపడ్డ మనోభావాలని, వాటిని మారుస్తామనడం తెలివి తక్కువ తనానికి నిదర్శనమని ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి తనకు తానే విలన్‌గా ప్రకటించుకున్నారని విమర్శలు సంధించారు.

తెలంగాణకు బతుకమ్మ వెన్నెముక: బీవీఆర్ చారి

మనిషి శరీరానికి వెన్నెముక ఎంత ముఖ్యమో.. తెలంగాణ రాష్ట్రానికి బతుకమ్మ అంతే ముఖ్యమని తెలంగాణ తల్లి రూపకర్త బీవీఆర్ చారి స్పష్టంచేశారు. తెలంగాణ తల్లి దేవతా మూర్తిగా ఉండాలని కేసీఆర్ భావించారని, సుదీర్ఘ చర్చలు జరిపి, ఎంతో ఆలోచించి తెలంగాణ తల్లి విగ్రహాన్ని తయారు చేయించారని గుర్తుచేశారు. అసలైన తెలంగాణ చరిత్రను తుడిచివేయడం సరికాదని హితవుపలికారు. మన సంస్కృతిని, చరిత్రను కాపాడుకుందామని పిలుపునిచ్చారు. తెలంగాణ అస్తిత్వాన్ని చరిత్రపుటల్లోంచి ఎవరూ తొలగించలేరని తేల్చిచెప్పారు.

ఉద్యమంలో నుంచి పుట్టిన తల్లిని మార్చడం సరికాదు: హమీద్ ఖాన్

ఉద్యమంలోంచి పుట్టిన తెలంగాణ తల్లిని మార్చడం సరికాదని జమాతే ఇస్లామీ హింద్ అధినేత హమీద్ ఖాన్ అభిప్రాయపడ్డారు. తెలంగాణ ఉద్యమానికి తెలంగాణ తల్లి ప్రతీక అని, వేలాది గ్రామాల్లో ఉన్న తెలంగాణ తల్లి విగ్రహాలను తొలగిస్తారా? అని ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డి కరుడుగట్టిన సమైక్యవాదిగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

విగ్రహం కాదు..తెలంగాణ అస్తిత్వం: గోగు శ్యామల

తెలంగాణ తల్లి అంటే కేవలం విగ్రహం కాదని, తెలంగాణ అస్తిత్వమని ప్రముఖ రచయిత్రి గోగు శ్యామల అన్నారు. సంస్కృతిని తుడిచివేసే ప్రయత్నం దుర్మార్గమని, ఆంధ్రా పాలకులు మన సంస్కృతిని ఏనాడూ గౌరవించలేదని, ఇప్పుడు స్వరాష్ట్రలోనే అలాంటి పరిస్థితులు నెలకొనడం బాధాకరమని ఆవేదన వ్యక్తంచేశారు. సంస్కృతి, అస్తిత్వాన్ని దెబ్బతీయాలనుకోవడం మూర్ఖత్వమని మండిపడ్డారు.

కేసీఆర్ హయాంలోనే కురుమ భవన్

- 2017లోనే కోకాపేటలో ఐదెకరాల స్థలం
- రూ.5 కోట్లతో అన్ని హంగులతో భవనం
- రేవంత్ పాలనలో ప్రహరీ మాత్రమే నిర్మాణం
- ఇప్పుడు దానిని ప్రారంభించి తమ ఘనతగా చెప్పకోవడంపై కురుమల విస్మయం

కోకాపేటలో కేసీఆర్ హయాంలో నిర్మించిన దొడ్డి కొమురయ్య కురుమ ఆత్మగౌరవ భవనం

హైదరాబాద్, డిసెంబర్ 14 (నమస్తేతెలంగాణ): కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో అన్ని వర్గాలు సుసంపన్నంగా ఎదుగాలనే లక్ష్యంతో కేసీఆర్ కులవృత్తులకు పెద్దపీట వేశారు. వేల కోట్లు వెచ్చించి ఆర్థికాభ్యున్నతికి బాటలు వేశారు. బడుగు, బలహీనవర్గాల కోసం సమున్నతంగా ఆత్మగౌరవ భవనాలు నిర్మించాలని నిర్ణయించారు. ఇందుకు మహానగరంలో విలువైన స్థలాలు కేటాయించారు. ఇందులో భాగంగా కురుమల ఆత్మగౌరవానికి ప్రతీకగా రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం కోకాపేటలో దొడ్డి కొమురయ్య పేరిట కురుమ ఆత్మగౌరవ భవనం నిర్మించాలని సంకల్పించారు.

సకల హంగులతో భవన నిర్మాణం..

తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ 2017లో కురుమ ఆత్మగౌరవ భవన నిర్మాణానికి కోకాపేటలో రూ.500 కోట్ల ఖరీదైన ఐదెకరాల స్థలం కేటాయించి, రూ.5 కోట్లు మంజూరు చేశారు. కులపెద్దల సూచనల మేరకు భవనాన్ని డిజైన్ చేశారు. మళ్లీ రెండోసారి సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత 2019లో పనులు ప్రారంభించారు. ఆ తర్వాత కరోనా కారణంగా నిర్మాణ పనులు ఆలస్యమై 2024లో సకల హంగులతో భవనాన్ని పూర్తి చేశారు. అధికారంలోకి రాగానే కులసంఘాల భవనాలకు నిధులు కేటాయిస్తామని రేవంత్ ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఏడాది తర్వాత కురుమ సంఘ భవనానికి ప్రహరీ నిర్మించి శనివారం ఈ భవనాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ఇది తమ ఘనతగా చెప్పకోవడంపై సభకు వచ్చినవారు విస్మయం వ్యక్తంచేశారు. రూ.500 కోట్ల విలువైన స్థలం కేటాయించిన కేసీఆర్‌ను మాటమాత్రంగానైనా ప్రస్తావించకపోవడంపై అసంతృప్తి వ్యక్తంచేశారు.

ప్రజల ఆకాంక్ష మేరకే వర్గీకరణ

- గ్లోబల్ మాదిగ-2024లో సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడి

హైదరాబాద్, డిసెంబర్ 14 (నమస్తే తెలంగాణ): 'కాంగ్రెస్ ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌లో మాదిగలకు అనుకూల నిర్ణయం తీసుకున్నాం. వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును తు.చ. తప్పకుండా అమలు చేస్తామని అసెంబ్లీలో వెల్లడించాం. అయితే ఈ సమస్య జఠిలంగా మారింది. ఈ పరిస్థితుల్లో ప్రజల ఆకాంక్ష మేరకు ముందుకెళ్తాం' అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో శనివారం నిర్వహించిన 'గ్లోబల్ మాదిగ-2024'లో రేవంత్ పాల్గొన్నారు. కోకాపేటలో హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, స్పీకర్ గడ్డం ప్రసాద్, మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి కురుమ భవనాన్ని ప్రారంభించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సుప్రీంకోర్టులో ఎస్సీ రిజర్వేషన్ల కేసులో బలమైన వాదనలు వినిపించామని చెప్పారు.

కులగణన ఓ మెగా హెల్త్ చెకప్

- కురుమలకు జనాభా ప్రాతిపదికన తగిన వాటా
- దొడ్డి కొమురయ్య కురుమ భవనం ప్రారంభంలో సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడి



కురుమ భవనం ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్, స్పీకర్ గడ్డం ప్రసాద్, మంత్రి పొన్నం

మణికొండ, డిసెంబర్ 14: కులగణన మెగా హెల్త్ చెకప్ లాంటిదని కుల గణన పూర్తయితే కురుమలకు జనాభా ప్రతిపాదికన దక్కాల్సిన వాటా దక్కుతుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. కోకాపేటలో దొడ్డి కొమురయ్య కురుమ భవన్‌ను గురువారం హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయతో కలిసి ముఖ్యమంత్రి ప్రారంభించారు. రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ఎగ్గె మల్లేశం అధ్యక్షతన జరిగిన సభలో రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ కురుమలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని చెప్పారు. రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడిన గొప్ప యోధుడు దొడ్డి కొమురయ్య అని కొనియాడారు. వరంగల్‌లో నిర్మించబోయే విమానాశ్రయానికి దొడ్డి కొమురయ్య పేరును పెట్టాలని కంచె ఐలయ్య కోరారని తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, విప్ ఐలయ్య, కర్ణాటక మాజీ మంత్రి రేవన్న, ఐఏఎస్ అధికారులు బాలమాయాదేవి, శ్రీధర్, ఎమ్మెల్యేలు ప్రకాశ్‌గౌడ్, శంకర్, శాసనమండలి చీఫ్ విప్ మహేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహదారు షబ్బీర్ అలీ పాల్గొన్నారు. కురుమ భవనం ప్రారంభ సభ వెలవెలబోయింది. రేవంత్‌రెడ్డి ప్రసంగిస్తున్న సమయంలో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి.

కేసీఆర్ ప్రస్తావన లేకపోవడం బాధాకరం: కురువ విజయ్‌కుమార్

కురుమ భవన నిర్మాణ ఘనత మాజీ సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని బీఆర్ఎస్ రాష్ట్ర నేత విజయ్‌కుమార్ అన్నారు. కేసీఆర్ పేరును రేవంత్ ఉద్దేశపూర్వకంగానే విస్మరించారని వాస్తవాలు కురుమలకు తెలుసని అన్నారు.

కురుమ భవన నిర్మాణం ఘనత కేసీఆర్‌దే: జగదీశ్వర్‌కురుమ

కురుమ భవన నిర్మాణ ఘనత కేసీఆర్‌దేనని బీఆర్ఎస్వీ రాష్ట్ర నేత జగదీశ్వర్ కురుమ అన్నారు. బీఆర్ఎస్ పాలనలో భవనాన్ని నిర్మిస్తే కాంగ్రెస్ నాయకులు తమ గొప్పగా చెప్పుకోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. ప్రహరీ నిర్మాణానికే కాంగ్రెస్‌కు ఏడాది సమయం పట్టిందని విమర్శించారు. భవనం ప్రారంభం సందర్భంగా కేసీఆర్ గురించి మాట్లాడకపోవడం బాధాకరమని పేర్కొన్నారు.